నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 19 మే 2024 | HYDERABAD

గ్రేటర్‌లో పలుచోట్ల భారీ వర్షం

లింగంపల్లిలో అత్యధికంగా 6.88 సెం.మీలు
మరో రెండు రోజులు వానలు: వాతావరణ కేంద్రం

సిటీబ్యూరో, మే 18 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం, అల్పపీడనం ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రాత్రి 10 గంటల వరకు లింగంపల్లిలో అత్యధికంగా 6.88 సెం.మీలు, చందానగర్‌లో 5.80, హస్తినాపురంలో 5.68, వనస్థలిపురంలో 5.0, నాచారం, రామంతాపూర్‌లో 4.78, రామచంద్రాపురం, బీహెచ్‌ఈఎల్‌లో 4.60, నాగోల్, అల్కాపురి కాలనీ, సరూర్‌నగర్‌లో 4.50 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ అధికారులు వెల్లడించారు. ఆవర్తనం, అల్పపీడనం ప్రభావంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని అనేక ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 32.8, కనిష్ఠం 24.5 డిగ్రీలు, గాలిలో తేమ 69 శాతంగా నమోదైనట్లు పేర్కొంది.

21, 22న నరసింహస్వామి జయంత్యోత్సవం

సిటీబ్యూరో, మే 18 (నమస్తే తెలంగాణ)/బంజారాహిల్స్ : బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో ఈనెల 21, 22తేదీల్లో శ్రీ నరసింహ జయంత్యోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్టు హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్య గౌర చంద్ర దాస ప్రభూజీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీ నరసింహ చతుర్దశిగా పిలుచుకునే ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆశీస్సులు పొందాలని సూచించారు. ఈనెల 21న లక్ష్మీ నరసింహస్వామి విశేష అలంకార దర్శనం, హోమం, అన్నదానం, హారతి తదితర కార్యక్రమాలు, 22న కలశ మహాభిషేకం, హోమం, భూసమేత నరసింహస్వామి కల్యాణోత్సవం, కల్యాణ విందు భోజన ప్రసాదం ఉంటుందన్నారు. ఈ వేడుకల సందర్భంగా భక్తులకు ఊంజల్ సేవలో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు.

ఎల్బీనగర్‌లో జలమయమైన రహదారి

మెట్టుగుట్ట-తార్నాక రోడ్‌లో..

రైల్లోంచి జారిపడి..

కాచిగూడ, మే 18: రైల్లోంచి జారిపడి ఓ మేస్త్రీ మృతి చెందాడు. కాచిగూడ రైల్వేస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన రమేశ్(40) ఉందానగర్-బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు హంద్రి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే చనిపోయాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాప్‌లో నిల్చుండగా..

బంజారాహిల్స్, మే 18: బస్‌స్టాప్‌లో నిల్చున్న యువకుడిపై దాడి చేసి.. అతడి వద్ద నుంచి సెల్‌ఫోన్‌తో పాటు నగదు లాక్కున్న ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ప్రకాశం జిల్లా పొన్నులూరుకు చెందిన మధు(23) జూబ్లీహిల్స్ రోడ్ నం. 36లోని ఓ సంస్థలో హెచ్‌ఆర్ విభాగంలో ఉద్యోగం చేస్తున్నాడు. అల్వాల్‌లోని భూదేవినగర్ నుంచి రోజూ ఆర్టీసీ బస్సులో డ్యూటీకి వచ్చి వెళ్తుంటాడు. ఈనెల 16న తెల్లవారుజామున 4 గంటల సమయంలో డ్యూటీ ముగించుకున్న మధు.. పెద్దమ్మగుడి బస్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉండగా, బైక్‌పై ఇద్దరు ఆగంతకులు మధును సెల్‌ఫోన్ ఇవ్వాలని అడిగారు. ఫోన్ ఇవ్వకపోవడంతో పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. సెల్‌ఫోన్, వాచ్‌తో పాటు జేబులో ఉన్న రూ.800 నగదును లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లోకి వచ్చి..

కీసర, మే 18: ఒంటరిగా ఉన్న ఓ వృద్ధురాలి పుస్తెల తాడును దుండగులు ఎత్తుకెళ్లారు. కీసర పోలీసుల కథనం ప్రకారం.. కీసర మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో జెల్లా రాములమ్మ శనివారం ఇంట్లో ఒంటరిగా ఉండగా, ఆగంతకులు ఆమె మెడలోంచి 4 తులాల పుస్తెలతాడును అపహరించుకుపోయారు. వృద్ధురాలికి మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో తెలిసిన వాళ్లే ఈ పని చేసి ఉంటారని..ఆమె కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదిట్రయల్ రనే..
మెట్రో వేళల్లో ఎలాంటి మార్పు లేదు

సిటీబ్యూరో, మే 18 (నమస్తే తెలంగాణ) : మెట్రో సమయాలను పొడిగిస్తారనే ఆశలపై హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ నీళ్లు చల్లింది. మెట్రో సమయాల్లో ఎలాంటి పొడిగింపు లేదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సోమ (ఉదయం 5.30), శుక్రవారం (రాత్రి 11.45 గంటలకు) జరిగినది కేవలం ట్రయల్ రన్ మాత్రమేనని, పలు పరిశీలనల తర్వాతే ఆ వేళలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. అప్పటివరకు యధావిధిగానే ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైళ్లు నడుస్తాయని పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం, డిమాండ్‌ను బట్టి మాత్రమే సేవలను పొడిగిస్తామన్నారు. పూర్తి స్థాయిలో అధ్యయనం తర్వాతే మెట్రో సమయాలపై స్పష్టమైన ప్రకటన చేస్తామన్నారు.

క్యాన్సర్ కారకాలు-చికిత్సపై పుస్తకం

ఉస్మానియా యూనివర్సిటీ: సీపీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ కంచ ఎడిటర్‌గా క్యాన్సర్ వ్యాధిపై సమగ్ర సమాచారంతో ముద్రించిన పుస్తకాన్ని ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. సీపీఎంబీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ 26 చాప్టర్లుగా పుస్తకాన్ని రూపొందించినట్లు చెప్పారు.

'ఆ విధానం వద్దు'

బండ్లగూడ, మే18: మున్సిపాలిటీల్లో రిజిస్ట్రేషన్ విలువలకు ఇంటి పన్నుకు ముడిపెట్టి లెక్కించడం వల్ల ఇంటిపన్నులు అధికం అవుతున్నాయని, ఇది నిరుపేదలకు సమస్యగా మారుతున్నదని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తమ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమస్యను వివరిస్తూ.. లేఖ రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెస్‌మెంట్, రిజిస్ట్రేషన్‌కు లింక్‌ను తీసివేసి.. గతంలో ఉన్న మాదిరిగానే ఇంటి పన్నులను లెక్కించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ కాలనీ ఫెడరేషన్ సభ్యులు నరేందర్‌బాబు, నదీం, వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తగ్గేదేలేదు..

బకాయిలు చెల్లిస్తేనే.. పనిచేస్తాం

మాన్‌సూన్, ఐఆర్టీ వర్క్‌లు చేయం
రూ.1350 కోట్ల బకాయిలు చెల్లించాల్సిందే
పనులు బంద్ పెట్టి.. బల్దియా కాంట్రాక్టర్ల నిరసన

సిటీబ్యూరో, మే 18, (నమస్తే తెలంగాణ) : మరికొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం...మరోవైపు గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు .. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీలో కాంట్రాక్టర్లంతా పనులను ఎక్కడికక్కడ నిలిపివేసి.. సమ్మె సైరన్ మోగించారు. దీంతో జీహెచ్‌ఎంసీలో ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్లు, డ్రైనేజీలు, నాలాలు, కరెంట్ పోల్స్, పార్కులు, ప్లే గ్రౌండ్, శ్మశాన వాటికల అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ ఇలా మెయింటెనెన్స్ పనులు చేపట్టే కాంట్రాక్టర్లంతా పనులు నిలిపివేసి శనివారం నుంచి బంద్‌లోకి దిగారు. రూ. 1350 కోట్ల బకాయిలు చెల్లించే వరకు తమ నిరసన కొనసాగుతుందని బల్దియాకు కాంట్రాక్టర్లు అల్టిమేటం జారీ చేశారు. తొలి రోజు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కాంట్రాక్టర్ల అసోసియేషన్ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. 'వీ వాంట్ పేమెంట్స్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. 'ఎవరినీ కష్టపెట్టడం మా ఉద్దేశం కాదు...బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చి, చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థిక నుడిగుండంలో చిక్కుకుని బతకలేని పరిస్థితిలో ఉన్నాం' అంటూ కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల చదువులకు డబ్బులు లేక, వర్కర్లకు ఈపీఎఫ్, బ్యాంకులకు ఈఎంఐలు కట్టలేకపోతున్నామని, ఆర్థిక బాధలతో సడెన్ స్ట్రోక్‌లకు గురై ప్రాణాలు పోతున్న పరిస్థితులు వచ్చాయని అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ. రామకృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నెలన్నర రోజుల కిందటే కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిసి పరిస్థితిని వివరించామని, ఇప్పటి వరకు ఎలాంటి ఫలితం లేదని, అందుకే నిరసన బాట పట్టామని చెప్పారు. సీఆర్‌ఎంపీ, ఎస్ఆర్‌డీపీ వంటి ప్రాజెక్టులు చేస్తున్న బడా కాంట్రాక్టర్లకు బ్యాంకుల నుంచి లోన్లు తెచ్చి మరీ ఇస్తున్నారని, మా లాంటి చిన్న కాంట్రాక్టర్లను పట్టించుకోవడం లేదని విమర్శించారు. 'మమ్మల్ని బ్లాక్ మెయిల్ చేసినా.. మేం తలొగ్గేదే లేదు' అవసరమైతే రానున్న రోజుల్లో ఇప్పుడు చేస్తున్న పనులే కాక వర్షాకాలం సంబంధించిన ఐఆర్టీ, మాన్‌సూన్ పనుల టెండర్లలో పాల్గొనబోమని రామకృష్ణారెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు. తమ బకాయిలు చెల్లిస్తేనే పనులు జరుపుతామని, రానున్న రోజుల్లో నిరసనను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కాగా, మొత్తంగా కాంట్రాక్టర్లు పనులు నిలిపివేయడంతో ప్రజా సమస్యలు మరిన్ని పెరిగే అవకాశాలున్నాయి.

భయం...భయం

శిథిల భవనాలపై పట్టింపేదీ?
ఈ ఏడాది స్పెషల్ డ్రైవ్ చేపట్టని బల్దియా

సిటీబ్యూరో, మే 18, (నమస్తే తెలంగాణ) : పురాతన భవనాలపై జీహెచ్‌ఎంసీ మీనమేషాలు లెక్కిస్తోంది. ఏటా వర్షాకాలం ముందుగానే శిథిల భవనాలపై టౌన్ ప్లానింగ్ సర్కిళ్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి. శిథిల, ప్రమాదకరమైన భవనాల్లో ఉన్న నివాసితులను గుర్తించి..వారిని అక్కడిని నుంచి ఖాళీ చేయించేందుకు వారికి ముందుగా కౌన్సెలింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాకుండా అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాల సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు ఆయా భవనాల చుట్టూ బారికేడ్లను అమర్చాల్సి ఉంటుంది. వీటి పరిసర ప్రాంతాల్లోని నివాసితులు తగిన జాగ్రత్తలు చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు శిథిల భవనాలపై గుర్తింపు, గతంలో నోటీసులు ఇచ్చిన భవనాల పటిష్టత, మరమ్మతు పనుల అంశాలపై సమీక్షించిన దాఖలాలు లేవు. కనీసం సర్కిళ్ల వారీగా కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు లెక్క అధికారుల వద్ద లేదు. వచ్చేది వర్షాకాలం..ఇటీవల కుండపోత వర్షాలు కురుస్తున్న దరిమిలా ప్రమాదకర భవనాల పట్ల స్థానికులు, నివాసితుల భద్రత గాలిలో దీపంలా మారింది. ఏదైన సంఘటన జరగకముందే అధికారులు అప్రమత్తమై శిథిల భవనాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

సర్వే చేయాలి కానీ..

వానకాల విపత్తుల నివారణలో భాగంగా శిథిల భవనాలను గుర్తించడం, పాత భవనాల పటిష్టత , భద్రతపై ఇంజినీరింగ్ విభాగాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం, అత్యంత ప్రమాదకరమైన కట్టడాలను కూల్చివేసేందుకు టౌన్ ప్లానింగ్ విభాగం సర్వే చేయాలి. ఈ డ్రైవ్‌లో భాగంగా పురాతన భవనాలపై జోన్ల వారీగా సర్వే చేసి..సంబంధిత భవనాన్యాతపై పరిశీలించి.. ప్రమాదకర భవనాలకు నోటీసులు జారీ చేయడం, వాటిని కూల్చివేయడం వంటివి చేయాలి. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనబడలేదు. వాస్తవంగా గతేడాది లెక్కల ప్రకారం జీహెచ్‌ఎంసీ పరిధిలో 620 శిథిల భవనాలు ఉన్నాయి. ఎల్బీనగర్‌లో 113, చార్మినార్‌లో 89, ఖైరతాబాద్‌లో 109, సికింద్రాబాద్‌లో 155, శేరిలింగంపల్లిలో 62, కూకట్‌పల్లిలో 92 శిథిల భవనాలు ఉండగా..ఇప్పటి వరకు వాటి పరిస్థితులు ఏమిటో ఉన్నతాధికారులు ఆరా తీయలేదు. గతేడాది లాగే ఈసారి కూడా శిథిల భవనాల విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాశీ.. కనువిందు చేసి..

బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని లుంబినీ మాల్‌లోని మంగత్రాయ్ షోరూమ్‌లో టాలీవుడ్ హీరోయిన్ రాశీ ఖన్నా సందడి చేశారు. 'వీనస్ బి గార్డెన్ ఆఫ్ ఎమరాల్డ్' పేరుతో రూపొందించిన ఆభరణాల కలెక్షన్లను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిజైనర్ నయన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. -బంజారాహిల్స్, మే 18

250 గజాల్లో.. 9 అంతస్తులు

కోకాపేటలో నిబంధనలను తుంగలో తొక్కుతూ.. నిర్మాణాలు చేపడుతున్నా.. టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. 250 గజాల స్థలంలో కేవలం జీ ప్లస్ 2 నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా.. నిబంధనలకు విరుద్ధంగా కొందరు ఏకంగా 8,9 అంతస్తులను కడుతున్నారు. గత కొన్నాళ్లుగా ఈ వ్యవహారం కొనసాగుతున్నా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

- మణికొండ, మే 18

24 గంటల్లోనే ట్యాంకర్ డెలివరీ..

సిటీబ్యూరో, మే 18, (నమస్తే తెలంగాణ): బుక్ చేసిన 24 గంటల్లోనే ట్యాంకర్‌ను డెలివరీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు వేగంగా సేవలందించేందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను జలమండలి వినియోగించిందన్నారు. వేసవి ప్రారంభం కాకముందే ఫిబ్రవరి నుంచే నీటికి డిమాండ్ ఏర్పడటం, బోర్లపై ఆధారపడే ప్రాంతాల ప్రజలు జలమండలి ట్యాంకర్లను భారీగా బుక్ చేసుకున్నట్లు వివరించారు. పలు ప్రాంతాల్లోని 30వేలకు పైగా ప్రజలు ట్యాంకర్లపైనే ఆధారపడ్డారని, దీంతో 2, 3 రోజులకు ఒకసారి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే స్థితి వచ్చిందన్నారు. ఆలస్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడటంలో అప్రమత్తమైన ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, ఎండీ సుదర్శన్‌రెడ్డి వరుస సమీక్షలతో కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. ట్యాంకర్ల సంఖ్య పెంచడం, కొత్త ట్యాంకర్ల కొనుగోలుతో పాటు అద్దెకు ట్యాంకర్లను సమకూర్చినట్లు పేర్కొన్నారు. వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్స్‌ను పెంచడం, ట్యాంకర్ డెలివరీలో వేగం పెంచుతూ సిబ్బందిని మూడు షిఫ్టుల్లో పనిచేసేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ట్యాంకర్ మేనేజ్‌మెంట్ సెల్, ప్రత్యేక యాప్ వంటి విధానాలను అమలు చేసి.. ప్రస్తుతం 24 గంటల్లోనే ట్యాంకర్ నీటిని అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎండీ సుదర్శన్‌రెడ్డి అప్రమత్తత, నిరంతర పర్యవేక్షణ, అధికారులు, సిబ్బంది సమష్టి కృషి ఫలితంగానే ఇది సాధ్యమైందన్నారు.

ట్యాంకర్ బుకింగ్, డెలివరీ సరళి

వివరాలు	మార్చి 1 నాటికి (వేసవి ప్రారంభ సమయంలో)	మే 17 నాటికి
మొత్తం ట్యాంకర్లు	584	872
ఫిల్లింగ్ స్టేషన్లు	72	89
ఫిల్లింగ్ పాయింట్స్	120	164
రోజువారీ బుకింగ్స్	3150	4065
రోజువారీ డెలివరీ	4500	6016
సరఫరా చేసిన ట్రిప్పులు	1,70,000	1,41,550

వర్షాకాలం.. సన్నద్ధత అవసరం

సమీక్షలో జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి

సిటీబ్యూరో, మే 18, (నమస్తే తెలంగాణ) : వర్షాకాల ప్రణాళికకు సన్నద్ధం కావాలని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వర్షాకాల ప్రణాళిక సన్నద్ధతపై ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో శనివారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. అనుకున్న దాని కంటే ముందే..రుతుపవనాలు వచ్చే అవకాశమున్నదని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో అందుకు తగ్గట్లుగా అధికారులు అప్రమత్తం కావాలని సూచించారు. తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి భద్రత సామగ్రి, రెయిన్ కోట్స్ సరిపడా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. ఒకవేళ సామగ్రి అవసరమైతే ముందస్తు సమాచారం అందించాలన్నారు. ఎయిర్ టెక్ యంత్రాలు, సిల్ట్‌కార్ట్ వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. వచ్చే వారం నుంచే క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. వర్షాలు ప్రారంభ కాకముందే అన్ని పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, డైరెక్టర్లు కృష్ణ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ స్థానంలో 'టీజీ'

సిటీబ్యూరో, మే 18 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, స్వయం ప్రతిపత్తిగల సంస్థలు, కార్పొరేషన్లు, వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు తదితరవన్నీ అధికారిక కమ్యూనికేషన్లలో తెలంగాణ కోడ్ టీఎస్‌కు బదులుగా టీజీ వినియోగించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో అధికారులను ఆదేశించారు. లెటర్ హెడ్స్, నివేదికలు, నోటిఫికేషన్లలో టీజీ పేర్కొనాలని సూచించారు. ప్రభుత్వ శాఖల ద్వారా నిర్వహించే ఉత్తర, ప్రత్యుత్తరాల్లో టీఎస్‌కు బదులుగా టీజీని ముద్రించాలన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు అమలు చేసిన చర్యలపై ఈనెల 25లోపు నివేదికలు పంపాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర అబ్రియేషన్స్ సూచించే టీఎస్ స్థానంలో టీజీని వినియోగించేందుకు కేంద్రం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసిన దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని కలెక్టర్ తెలిపారు.

కమీషన్లు అడుగుతుండ్రు..

సిటీబ్యూరో: మధ్యవర్తుల మోసాలపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని లోక్‌సభ ఎన్నికల్లో సిబ్బందికి వాహన సేవలు అందించిన డ్రైవర్లు డిమాండ్ చేశారు. మధ్యవర్తులు తమకు వచ్చే ఆదాయంలో కమీషన్ పేరుతో రూ. 200 కట్ చేసుకుంటామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ షేక్ సలావుద్దీన్ శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి కమీషన్ దందాపై ఫిర్యాదు చేశారు. జీవో నంబర్ 166 ప్రకారం కారుకు రూ.1430, డ్రైవర్ బత్తా రూ.520, ప్రతి పది కిలోమీటర్లకు లిటర్ డీజిల్‌ను ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నట్టు అధికారి దృష్టికి తీసుకెళ్లారు. మే 14 తర్వాత క్యాబ్ అవసరాలు ముగిశాయి. దీంతో అందరూ బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారని.. ఎవరైతే మధ్యవర్తులుగా ఉండి క్యాబ్‌లను సమకూర్చారో వారు కమీషన్ ఇవ్వాలంటూ డ్రైవర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. డ్రైవర్లకు న్యాయం చేయాలని ఆయన కోరారు.